
సాక్షి చిత్తూరు

సోమవారం । 7 । ఆగస్టు । 2023



సెప్టెంబర్‌లో కాణిపాకం బ్రహ్మోత్సవాలు

కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. - 8లో



గద్దర్‌కు సైకత నివాళి

చిల్లకూరు: ప్రజాగాయకుడు గద్దర్‌ను స్మరించుకుంటూ ఆదివారం తీగపాళెం సముద్రం ఒడ్డున సైకత శిల్పంతో సనత్‌కుమార్ నివాళర్పించారు.

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	37	25
తిరుపతి	38	26
తిరుమల	33	22
గూడూరు	38	28
నగరి	38	26

న్యూస్‌రీల్

ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



మూషిక వాహనంపై వినాయకస్వామి ఊరేగింపు

పాకాల : మండలంలోని ఉప్పరపల్లి పంచాయతీ ఊట్లవారిపల్లికి సమీపంలోని ఆనందగిరిపై వెలసిన ప్రముఖ శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్ర 3.30 గంటలకు అక్కగార్ల పూజ, 6.30 గంటలకు గణపతి పూజ, కంకణధారణ, పుణ్యహ వచనం, వాస్తుశాంతి, అంకురార్పణం, కలశస్థాపన హోమం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు మూషిక వాహనంపై శ్రీవినాయకస్వామి ఊరేగింపు వేడుకగా జరిగింది. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మెన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి మాట్లాడుతూ సోమవారం సాయంత్రం రాత్రి 8 గంటలకు నంది వాహనంపై పార్వతీ పరమేశ్వరులు ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు యోగానంద చౌదరి, బాబు రెడ్డి, లోకనాథం, రేవతి, మాధవి, మమత, కృష్ణమూర్తి శర్మ తదితరులు పాల్గొన్నారు.

టీసీ రాజన్‌కు ఘన సత్కారం



స్వాతంత్ర్య సమరయోధుడు టీసీ రాజన్‌ను సత్కరిస్తున్న కళాశాల నిర్వాహకులు

పలమనేరు: పట్టణానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఎమ్మెల్యే టీసీ రాజన్‌ను స్థానిక మదర్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఆదివారం ఘనంగా సత్కరించారు. మేరామాత- మేరాదేశ్ కార్యక్రమానికి ఆయనను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన నాటి స్వాతంత్ర్య ఉద్యమ పరిస్థితులు, నాటి రాజకీయాలు, విలువలను వివరించారు. టీసీ రాజన్ సేవలను విశ్రాంత ఆచార్యులు వెంకటకృష్ణ తెలియజేశారు. చైర్మన్ ఎమ్మార్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జి కిశోర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



నోటు పుస్తకాలు అందజేస్తున్న జడ్జి కరుణకుమార్

బంగారుపాళెం: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి కరుణకుమార్ అన్నారు. స్థానిక ఎన్‌పీసీ నాయుడు పార్కు ఆవరణలో ఆదివారం మాజీ ఎంపీ చెంగల్రాయనాయుడు 110 జయంతిని నిర్వహించారు. కార్యక్రమానికి జడ్జి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి 300 మంది హాస్టల్ విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను జడ్జి చేతుల మీదుగా అందజేశారు. కరుణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చక్కగా చదువుకోవాలని సూచించారు. చదువుతోనే ఉన్నత స్థానం లభిస్తుందని తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ జయచంద్రనాయుడు, మాజీ సర్పంచ్ కమలనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అర్జున తపస్సు



తపస్సుమాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి

యాదమరి: మండలంలోని కాశిరాళ్ల శ్రీద్రౌపదీధర్మరాజస్వామి ఆలయ మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అర్జున తపస్సు వేడుకగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేకపూజలు, అలంకరణలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అర్జున తపస్సు ఘట్టం ప్రారంభమైంది. తపస్సుమాను వద్ద ద్రౌపది, పాండవుల విగ్రహాలను కొలువుదీర్చి పూజలు చేశారు. సంతాన వరం కోరుతు పలువురు మహిళలు తపస్సుమాను చుట్టూ వరపడ్డారు. అర్జున వేషధారి మహాశివుడి వరం కోరుతూ కీర్తనలు ఆలపిస్తూ తపస్సు మాను అధిరోహించారు. అక్కడి నుంచి అర్జున వేషధారి వీబూది పండ్లు, నిమ్మపండ్లను పైనుంచి కిందికి విసరగా భక్తులు వాటిని అందుకునేందుకు పోటీపడ్డారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం రావడంతో గ్రామంలో సందడి నెలకొంది.

ఆడుదాం ఆంధ్రా



యువతలో ఆసక్తిని పెంచే ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తోంది. ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడోత్సవాలకు చర్యలు చేపట్టింది. నైపుణ్యం కలిగిన క్రీడాకారులను వెలికి తీసేందుకు క్రీడా సంబరాన్ని మోగించింది. అక్టోబరు రెండవ తేదీన మహాత్మా గాంధీ జయంతి నాటి నుంచి 46 రోజులపాటు గ్రామ, వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రీడా సంబరాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను ఉమ్మడి చిత్తూరు జిల్లాల కలెక్టర్లు సిద్ధం చేస్తున్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో వంటి ఆటలతోపాటు మూడు కిలో మీటర్ల మారథాన్, యోగా, టెన్నికాయిట్ వంటి సంప్రదాయేతర పోటీలు నిర్వహించనున్నారు.

- గాంధీ జయంతి నాడు సంబరాలు ప్రారంభం
- పకడ్బందీగా జిల్లా యంత్రాంగం కసరత్తు
- గ్రామ స్థాయి నుంచి క్రీడాపోటీలు
- ఎంపిక చేసిన క్రీడాకారులకు శిక్షణ
- కలెక్టర్‌లకు పర్యవేక్షణ బాధ్యతలు

క్రీడా పోటీల తేదీలు ఇలా...

గ్రామ,వార్డు సచివాలయ స్థాయి..
అక్టోబర్ 2 నుంచి 10 వరకు

మండల స్థాయిలో
అక్టోబర్ 13 నుంచి 18 వరకు

నియోజకవర్గ స్థాయిలో
అక్టోబర్ 21 నుంచి 24 వరకు

జిల్లా స్థాయిలో
అక్టోబర్ 27, 28 తేదీల్లో

రాష్ట్ర స్థాయిలో
నవంబర్ 1 నుంచి 8 వ తేదీ వరకు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలకు అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఆ పోటీల నిర్వహణకు రెండు జిల్లాల కలెక్టర్‌లు షణ్మోహన్, వెంకటరమణారెడ్డి, క్రీడాప్రాధికార సంస్థ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ పోటీల నిర్వహణకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. అక్టోబర్ 2న మహాత్మాగాంధీ జయంతి రోజున పోటీలు ప్రారంభించి 46 రోజుల పాటు నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ క్రీడల్లో పోటీలను నిర్వహించనున్నారు. గ్రామ, వార్డు సచివాలయ స్థాయి నుంచి క్రీడాకారులను పోటీలకు ఆహ్వానిస్తున్నారు. మొదట సచివాలయ స్థాయిలో తర్వాత మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తారు. పోటీల నిర్వహణకు రెండు నెలల సమయం ఉండడంతో గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో క్రీడాకారులను గుర్తించి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. బాల,బాలికలకు విడివిడిగా క్రీడా పరికరాలను కూడా అందివ్వనున్నారు. పోటీల నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. గ్రామ స్థాయిలో యువజన సంఘాలను భాగస్వాములను చేసే విధంగా అధికారులు ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. అవసరం అయితే జిల్లా స్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించి క్రీడల ప్రాధాన్యతను వివరించి అవగాహనా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

నాడు : టీడీపీ పాలనలో క్రీడాభివృద్ధికి చేసిందేమి లేదు. గ్రామీణ స్థాయిలో క్రీడల అభివృద్ధికి పట్టించుకున్న దాఖలాలు లేవు. క్రీడల్లో రాణించి ఒలంపిక్ స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులకు అందాల్సిన ప్రోత్సాహకాలను అందివ్వని దుస్థితి. క్రీడాకారులు క్రీడల పట్ల మక్కువ చూపినప్పటికీ వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా క్రీడాభివృద్ధిని నీరుగార్చిన పరిస్థితి.

నేడు : చిత్తూరు జిల్లాకు చెందిన హాకీ క్రీడాకారిణి ఈ.రజిని టోక్యో ఒలింపిక్స్‌లో ప్రతిభ చాటింది. ఆమెకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 2021 ఆగస్టు 12న ప్రోత్సాహకాలను ప్రకటించి అందజేశారు. రూ.25 లక్షల నగదు, ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభు త్వ ఉద్యోగం, తిరుపతిలో వెయ్యి గజాల నివాస స్థలం, నెలకు రూ.40 వేలు ఇన్‌సెంటివ్ ఇవ్వాలని ఆదేశించారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వైఎస్సార్‌సీపీ సర్కారు ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాలకు శ్రీకారం చుట్టింది.

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

చిత్తూరు జిల్లాలో	
గ్రామ, వార్డు సచివాలయాలు	612
పీడీలు, పీఈటీలు	276 మంది
తిరుపతి జిల్లాలో	
గ్రామ, వార్డు సచివాలయాలు	691
పీడీలు, పీఈటీలు	275 మంది

క్రీడాభివృద్ధికి చర్యలు



"రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి చర్యలు చేపడుతోంది. ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా పోటీలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహించనుంది. ఈ పోటీల నిర్వహణపై సమీక్షలు నిర్వహించి ఆదేశాలు జారీ చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు పకడ్బందీగా క్రీడల నిర్వహణ కసరత్తుపై దృష్టి పెడుతున్నాం. – షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను వినతులు రూపంలో అందజేయవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. స్పందనలో నమోదయ్యే అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు స్పందనకు కచ్చితంగా హాజరుకావాలని ఆదేశించారు. గైర్హాజరైతే శాఖా పరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

నేడు పోలీసు స్పందన

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చని తెలిపారు.

మురుగన్‌కు హరోహరా



కావళ్లతో వెళుతున్న భక్తులు

గుడిపాల: మండలంలోని పెద్దదళవాయిపల్లె ఆదివారం హరోహర నామస్మరణలతో మార్మోగింది. గ్రామస్తులు ఉపవాసాలతో పసుపు దుస్తులు ధరించి కావళ్లతో వళ్లిమలైలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయానికి బయలుదేరారు. తొలుత గ్రామంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం కావళ్లకు అభిషేకం చేసి గ్రామ వీధుల్లో 'మురుగన్‌కు హరోహరా..కందన్‌కు హరోహరా' అంటూ మొక్కులు చెల్లించేందుకు బయలుదేరారు.

ఆదర్శ క్షేత్రంగా బోయకొండ

వరాల దేవత శ్రీబోయకొండ గంగమ్మ ఆలయాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ పుణ్య క్షేత్రంగా గుర్తింపు తీసుకువచ్చేలా అభివృద్ధి చేయడమే ధ్యేయమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం చౌడేపల్లె మండలంలో మంత్రి సుడిగాలి పర్యటన చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బోయకొండ రూపు రేఖలను మార్చుతూ మాస్టర్ ప్లాన్ ఆధారంగా అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. యాత్రికులకు అవసరమైన ఏర్పాట్లను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. బోయకొండలో రూ.12 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

- విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- రూ.12 కోట్ల నిధులతో చేపట్టిన పనుల ప్రారంభోత్సవం
- రూ.50 లక్షలతో ఎకోపార్కుకు భూమి పూజ
- అమ్మవారిని దర్శించుకున్న మంత్రి పెద్దిరెడ్డి



ఎకో పార్కుకు భూమిపూజ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

చౌడేపల్లె: జిల్లాలో కాణిపాకం అనంతరం ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయాన్ని రూ.కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన గంగమ్మ గుడి వద్ద పలు ప్రారంభోత్సవాలు చేశారు. ఆర్చి నుంచి గంగమ్మ ఆలయం వరకు రూ.9.54 కోట్లతో చేపట్టిన తారురోడ్డును మంత్రి ప్రారంభించారు. బోయకొండ గంగాపురంలో అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.50 లక్షల వ్యయంతో ఎకో పార్కు ఏర్పాటుకు భూమి పూజ చేశారు. యాత్రికుల సౌకర్యార్థం రూ.38 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన కల్యాణ కట్టను ప్రారంభించారు. రూ.32 లక్షల వ్యయంతో భవానీ నగర్ నుంచి ఆలయం వద్దకు ఏర్పాటుచేసిన విద్యుద్దీకరణ పనులను ప్రారంభించారు. రూ.22 లక్షల వ్యయంతో ఆమినిగుంట సమీపంలో గల ఆవుల చెరువు ఆధునీకరణ పనులను ప్రారంభించారు. వీటితో పాటు రూ.50 లక్షల వ్యయంతో పది గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లును ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ బోయకొండ గంగమ్మ దర్శనానికి వివిధ రాష్ట్రాల భక్తులు వేల సంఖ్యలో తరలి వస్తున్నారని, సెలవురోజుల్లో రద్దీ అధికంగా ఉంటోందని తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సదుపాయాలు కల్పిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. అంతకు ముందు బోయకొండ గంగమ్మ తల్లిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ మర్యాదలతో ఈఓ చంద్రమౌళి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఈఓ శేష వస్త్రం కప్పి, పవిత్ర తీర్థప్రసాదాలను అందజేశారు. వేద పండితులు ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, నేతలు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, కొండవీటి నాగభూషణం, ఎంపీపీ రామమూర్తి, మాజీ ఎంపీపీలు రెడ్డిప్రకాష్, అంజిబాబు, రుక్మిణమ్మ, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, నరసింహయాదవ్, కాపు యువత అధ్యక్షుడు మిద్దింటి కిషోర్ బాబు, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, దేవదాయశాఖ ఏసీ ఏకాంబరం, డీఎఫ్‌ఓ చైతన్య కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ సుధాకర్, డ్వామా ఏపీడీ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బోయకొండలో కల్యాణ కట్టను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



బోయకొండ గంగమ్మ ఆలయంలో మంత్రి పెద్దిరెడ్డికి తీర్థప్రసాదాలను అందజేస్తున్న ఈఓ

సూర్యప్రభ వాహనంపై షణ్ముఖుని విహారం



పురవీధుల్లో కుమారస్వామి విహారం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన ప్రముఖ శ్రీవల్లీదేవసేన సమేత కుమారస్వామి ఆలయ ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు సూర్యప్రభ వాహనంపై ఊరేగారు. ఈ సందర్భంగా ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ సూర్యప్రభ వాహనంపై స్వామివారు పురవిహారం చేశారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ముక్కంటి ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 23 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 81,472 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 34,820 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.90 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

గాయపడిన పోలీసులను పరామర్శించిన ఎస్పీ



ఏఎస్పీ నాగేశ్వరరావుతో మాట్లాడుతున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి



ఆర్‌ఐ నీలకంఠేశ్వరరెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎస్పీ

- పుంగనూరు ఘటన

చిత్తూరు అర్బన్: పుంగనూరులో టీడీపీ నేతలు సృష్టించిన విధ్వంసకాండలో గాయపడిన పోలీసు అధికారుల్లో చిత్తూరు ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, పరిపాలన ఆర్‌ఐ నీలకంఠేశ్వరరెడ్డిను ఎస్పీ రిషాంత్ రెడ్డి పరామర్శించారు. ఆదివారం రాత్రి నాగేశ్వర రావు, నీలకంఠేశ్వరరెడ్డి నివాసాలకు వెళ్లిన ఎస్పీ వారి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. టీడీపీ కార్యకర్తలు విసిరిన రాళ్లు ఏఎస్పీ ఎడమ చెవిపై తలగడంతో.. చెవిలోంచి రక్తం వచ్చి, ఇన్‌ఫెక్షన్ కూడా అయ్యింది. నీలకంఠేశ్వరరెడ్డి కుడి చేతి వేళ్ల వద్ద స్వల్పంగా క్రాక్ వచ్చింది. ఇద్దరు అధికారులను పరామర్శించిన ఎస్పీ, వారి కుటుంబ సభ్యులకు పోలీసుశాఖ తరపున భరోసా ఇచ్చారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తామని, పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ఎస్పీ వెంట ఆర్‌ఐ మధు ఉన్నారు.

గోశాలకు నవధాన్యాల గ్రాసం



గోశాలలో గ్రాసం తింటున్న పశువులు

పూతలపట్టు: మండలంలోని తిమ్మిరెడ్డిపల్లెకు చెందిన రైతు మధుసూదన్ రెడ్డి ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన నవ ధాన్యాల గ్రాసాన్ని ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానం గోశాలకు వితరణగా అంద జేశారు. సుమారు 7 టన్నుల గడ్డిని టీటీడీ గోశాల అధికారి సుమన్‌కు అందించారు. ప్రకృతి సాగుతో తయారైన ఈ గ్రాసం తినడం ద్వారా పశువులు ఆరోగ్యంగా ఉంటాయని ఆయన తెలిపారు. రసాయన ఎరువుల వినియోగంతో విషపూరిత దిగుబడులు వస్తాయని, వీటిని ఉపయోగించడం కారణంగా మనిషి జీవిత కాలం తగ్గిపోతోందని తెలిపారు. రైతులు ప్రకృతికి వ్యవసాయంపై దృష్టి సారించి, రసాయనిక ఎరువులకు బదులు కషాయాలు వాడాలని సూచించారు.

ఉమ్మడి జిల్లా చెస్ పోటీలు ప్రారంభం



చెస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నగరి : స్వాతంత్ర్యదినోత్సవం, నగరి చెస్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నగరి డిగ్రీ కళాశాల ఆవరణలోని కేవీకే ఇండోర్ స్టేడియంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాల నుంచి 170 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ కె.వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం రాజులు యుద్ధంలో ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ప్రత్యర్థులను మట్టి కరిపించేందుకు అనుసరించిన విధానాలతో పుట్టుకొచ్చిందే చదరంగం అన్నారు. అది రానురాను క్రీడగా మారి విశ్వవ్యాప్తమై ఎందరికో పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టిందన్నారు. ఈ క్రీడతో జ్ఞాపకశక్తి బాగా పెరుగుతుందని, విజ్ఞానాన్ని పెంచుతుందన్నారు. లయన్స్ క్లబ్ నగరి అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ ఫైనల్స్ జరుగుతుందని తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఓ.బాలసుబ్రమణ్యం, లయన్స్‌క్లబ్ మెంబర్‌షిప్ చైర్‌పర్సన్ ఎస్ఎస్ బాలసుబ్రమణ్యం, జిల్లా చైర్‌పర్సన్ ప్రభాకర్‌రాజు, డైరెక్టర్ రవిబాబు, నగరి క్లబ్ మాజీ అధ్యక్షుడు రామ్మోహన్, తిరుపతి చెస్ అసోసియేషన్ కోఆర్డినేటర్ బాలాజీ, కార్యదర్శి శ్రీనివాస సూరి, నగరి లైన్స్ క్లబ్ అధ్యక్షుడు ఏ.మోహన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏఆర్ జీవన్, మాజీ అధ్యక్షుడు రామ్మోహన్, ఎంఈఓ ప్రభాకర్ రాజు, క్రీడా శాఖ కన్వీనర్ శీను రాజు, నగరి చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఖలీల్, కన్వీనర్ సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళల క్రికెట్ టోర్నీలో బౌలర్ల హవా


4 వికెట్లు పడగొట్టిన బౌలర్ వైష్ణవి

వెంకటగిరి : పట్టణంలోని తారకరామా మైదానంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న అండర్–15 మహిళల క్రికెట్ టోర్నీలో ఆదివారం బౌలర్లు సత్తా చాటారు. చిత్తూరు–కర్నూలు, అనంతపురం–కంబైన్డ్ (నెల్లూరు, కడప) జట్ల మధ్య జరిగిన పోటీల్లో బౌలర్లు చెలరేగారు. గ్రౌండ్–1లో చిత్తూరు– కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కర్నూలు జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 25 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 91 పరుగులు చేసింది. చిత్తూరు జట్టు క్రీడాకారిణి డి.వైష్ణవి 4 వికెట్లు పడగొట్టి ప్రతిభ చాటింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 15.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 92 పరుగులు చేసి విజయం సాధించింది. ఇక గ్రౌండ్–2 లో అనంతపురం–కంబైన్డ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కంబైన్డ్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగి19.3 ఓవర్లలో 60 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతపురం జట్టు బౌలర్లు రోషనార, శారద, గౌతమి 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 7.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 61 పరుగులు చేసి గెలుపొందింది.

సెప్టెంబర్ 18నుంచి కాణిపాకం బ్రహ్మోత్సవాలు


శ్రీకాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 20 రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారంభించింది. తొమ్మిది రోజులు బ్రహ్మోత్సవాలు, 11 రోజులు ప్రత్యేక బ్రహ్మోత్సవాలు(ఉభయదారులు) నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటికే ఉభయదారులు, అధికారులతో సమావేశాలు నిర్వహించి సూచనలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలు, పార్కింగ్, ఉచిత భోజన వసతి, ప్రసాదాలు, పార్కింగ్, విద్యుత్ అలంకరణలు తదితరాల ఏర్పాట్లు ఆహా అనిపించేలా చేయనున్నట్లు వివరించారు. వాహన సేవలు తిలకించేందుకు వచ్చే భక్తులకు కూడా అన్ని వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

సెప్టెంబర్ 18	వినాయక చవితి, పుష్ప కావళ్ల ప్రారంభం	
19న	ఉదయం ధ్వజారోహణం,	రాత్రి హంస వాహనం
20న	ఉదయం స్వర్ణ నెమలి వాహనం	
21న	రాత్రి మూషిక వాహనం	
22న	ఉదయం స్వర్ణ చిన్న శేష వాహనం	రాత్రి స్వర్ణ పెద్ద శేషవాహనం
23న	పగలు చిలుక వాహనం	రాత్రి వృషభ వాహనం
24న	రాత్రి గజ వాహనం	
25న	మధ్యాహ్నం రథోత్సవం	
26న	ఉదయం భిక్షాండి ఉత్సవం, తిరుకల్యాణం	రాత్రి అశ్వవాహనం
27న	సాయంత్రం ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవం	రాత్రి ఏకాంతసేవ

ప్రత్యేక ఉత్సవాల వాహన సేవలు రాత్రి మాత్రమే

28న	అధికార నంది వాహనం
29న	రావణబ్రహ్మ వాహనం
30న	యాళి వాహనం
అక్టోబర్ 1వ తేదీ	విమానోత్సవం
02న	సూర్యప్రభ
03న	చంద్రప్రభ
04న	కామధేనువు
05న	కల్పవృక్షం
06న	పూలంగిసేవ
07న	పుష్పపల్లకి
08న	తెప్పోత్సవం

అభిమాన నేతకు అభినందనలు






టీటీటీ చైర్మన్‌గా నియమితులైన భూమన కరుణాకరరెడ్డిని కలిసి అభినందనలు తెలియజేస్తున్న ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి, టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి మంగళం : టీటీడీ చైర్మన్‌గా నియమితులైన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. ఆదివారం తిరుపతి పద్మావతిపురంలోని ఆయన నివాసం అభిమానులతో కిక్కిరిసింది. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఆరణి శ్రీనివాసులు, మేయర్ శిరీష, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కే బాబు, టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, తాతయ్యగుంట గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీ యాదవ్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సమష్టిగా పనిచేసి విజయవంతం చేద్దాం


ఉభయదారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను సమష్టిగా పనిచేసి విజయవంతంగా నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం అనుబంధ మణికంఠేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం బ్రహ్మోత్సవ ఉభయదారులతో సమావేశం నిర్వహించారు. ఈఓ, చైర్మన్ మాట్లాడుతూ సెప్టెంబరు 18వ తేదీ నుంచి 20 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలను అందరు కలిసి ఐక్యమత్యంతో విజయవంతం చేయాలని కోరారు. ఉభయదారులు మాట్లాడుతూ స్వామివారి దర్శనంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రత్యేక దర్శనాల కోసం ఈఆర్‌ఓ కార్యాలయం ఏర్పాటు చేసినా ఉపయోగకరంగా లేదన్నారు. ఆలయంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలపై సమాచారం ఇవ్వాలని కోరారు. దీనిపై ఆలయ ఈఓ, చైర్మన్ మాట్లాడుతూ ఉభయదారులకు అన్నింటా ప్రాధ్యానం ఇస్తామని తెలిపారు. ఉభయదారుల సంఘం అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ జ్ఞానశేఖర్‌రెడ్డి, ఉభయదారులు, మాజీ చైర్మన్లు జగన్నాథంరెడ్డి, మణినాయుడు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం–నిందితుడి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్‌ఈబీ పోలీసులు

చిత్తూరు అర్బన్: ఐరాల మండలంలో సారా విక్రయిస్తున్న హేమచంద్రబాబు (47) ను చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) చిత్తూరు రూరల్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఐరాల మండలంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రెండు లీటర్ల సారా కలిగి ఉన్న హేమచంద్రబాబును అరెస్టుచేసి, మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచారు. మేజిస్ట్రేట్ ఆదేశాలతో చిత్తూరు జిల్లా జైలుకు రిమాండుకు తరలించారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యం, మమత, వెంకటేష్, రేఖ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంల సంఘం కార్యవర్గం ఏకగ్రీవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న హెడ్‌మాస్టర్ల సంఘం నూతన కమిటీ

చిత్తూరు కలెక్టరేట్ : హెడ్‌మాస్టర్ల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ ఎన్నికలకు డైట్ కళాశాల లెక్చరల్ చెంగల్‌రాజు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా అరుణ్‌కుమార్(ఐరాల), ప్రధాన కార్యదర్శిగా రవీంద్రనాథ్‌రెడ్డి (వి.కోట), ఆర్థిక కార్యదర్శిగా హేమాద్రి (చిత్తూరు రూరల్ మండలం)ను ఎన్నుకున్నారు. అనంతరం హెడ్‌మాస్టర్ల సమస్యలపై చర్చించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ అందరూ నిబంధనలు పాటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

అగ్ని ప్రమాదంలో గడ్డివామి దగ్ధం


దగ్ధమైన గడ్డివాము వద్ద బాధిత రైతు

రొంపిచెర్ల: రొంపిచెర్ల పంచాయతీ వారణాసివారిపల్లెలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో రైతు వెంకట్రామయ్యకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. బాధితుని కథనం మేరకు పొలంలో వ్యవసాయ మోటారు సమీపంలో గడ్డివామి ఉంది. ఉదయం కరెంటు వచ్చిన సమయంలో మోటార్ వద్ద వైర్లు షార్ట్ సర్క్యూట్ అయి నిప్పురవ్వలు లేచాయి. ఇవి గడ్డివామికి తగలడంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది. రూ.70 వేలు వరకు నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

దశాబ్దాల దారి సమస్యకు పరిష్కారం

- మంత్రి ఆర్కే రోజా చొరవతో దాతల సహకారం
- పేదల ఇళ్ల నిర్మాణానికి లైన్ క్లియర్
- కొత్తదారికి మార్గం సుగమం


దారి ఏర్పాటు విషయమై చర్చిస్తున్న వైఎస్సార్ సీపీ నేత రామ్‌ప్రసాద్ రెడ్డి

నగరి : మండలంలోని గుండ్రాజుకుప్పం ఆదిఆంధ్రవాడ అర్ధ శతాబ్ద దారి సమస్య మంత్రి ఆర్కేరోజా చొరవతో పరిష్కారమైంది. ఆదిఆంధ్రవాడకు సరైన పక్కా దారి లేకపోవడంతో పొలాల మధ్య గెనాలే దారిగా ఉండేది. పంటలు వేయని సమయంలో పొలాలపై ద్విచక్ర వాహనాల్లో వెళుతారు. పంట సాగు చేసే సమయంలో నడిచే వెళ్లాల్సిందే. ఆదిఆంధ్రవాడలో సుమారు 74 కుటుంబాలు ఉండగా, 300 మంది జనాభా ఉన్నారు. దారి సమస్యను పరిష్కరించాలని అధికారుల చుట్టూ తిరిగినా అతీగతీ ఉండేది కాదు. ఈ ప్రాంతంలో 28 మందికి పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇళ్లు మంజూరయ్యాయి. అయితే పాత ఆది ఆంధ్ర వాడ నుంచి గ్రామకంఠం వరకు రహదారి లేకపోవడంతో పక్కా ఇళ్ల నిర్మాణం ఆచరణకు నోచుకోలేదు. దీంతో వీరందరూ దారి సమస్యను పరిష్కరించాలంటూ ఇటీవల మంత్రి ఆర్కేరోజాను కలిసి మొరపెట్టుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ఒక్క అడుగు ముందుండే మంత్రి సమస్యను పరిష్కరిస్తానంటూ వారికి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు వారికి దారి ఏర్పాటు చేయాల్సిన దిశగా ప్రభుత్వ భూములు ఉన్నాయా అని అధికారులతో చర్చించారు. అక్కడ ఉన్నదంతా పట్టా భూములు కావడంతో రైతుల సహకారం అవసరమైంది. దీంతో మంత్రి ఆదేశాలతో ఆమె సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత రామ్‌ప్రసాద్ రెడ్డి దారికి భూములు ఇవ్వాల్సిన రైతులతో చర్చించారు. దారి అవసరాన్ని రైతులకు వివరించారు. రైతులు ఇచ్చే సహకారం కొన్ని తరాల వరకు పేరును చిరస్థాయిగా నిలుపుతుందని వారికి తెలియజెప్పడంలో సఫలీకృతులయ్యారు. పట్టాదారులైన రైతులు అన్నామలై మొదలియార్, ఏకాంబరం మొదలియార్‌లు తమ భూముల నుంచి 12 అడుగుల వెడల్పు, 150 అడుగుల వెడల్పుతో ఉన్న స్థలాన్ని ఉచితంగా ఇచ్చేందుకు అంగీకరించారు. వారి సహకారంతో దారి ఏర్పాటు పనులు ఊపందుకున్నాయి. ఆదిఆంధ్రవాడ ప్రజల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. దశాబ్దాల సమస్యను పరిష్కరించి మాకు మంచి చేసిన మంత్రి ఆర్కే రోజాను జీవితాంతం గుర్తుంచుకుంటామని స్థానికులు తెలిపారు. ముందుండి తమకు దారి ఏర్పాటుచేయించిన మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆమె సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఇక 28 మంది పేదల ఇంటి నిర్మాణం ఆటంకం లేకుండా నిర్మాణం కానుంది.

ఆర్య వైశ్య సంఘం నూతన కార్యవర్గం


ప్రమాణ స్వీకారంలో కార్యవర్గ సభ్యులు

చిత్తూరు రూరల్: చిత్తూరు అర్బన్ జిల్లా ఆర్య వైశ్య సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటైంది. నగరంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రంలో ముఖ్య నాయకులు నరసింహ శెట్టి, ఆరూరు ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ద్వారకనాథ్, ప్రధాన కార్యదర్శిగా రవీంద్రబాబు, అదనపు ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారిగా ప్రకాష్ ఎన్నికయ్యారు. చిత్తూరు అర్బన్ జిల్లా యువత అధ్యక్షుడిగా భాస్కర్, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర, కోశాధికారిగా సంపత్‌కుమార్, ఆర్యవైశ్య సేవాదళ్ అధ్యక్షుడిగా కిరణ్ కుమార్, కార్యదర్శిగా విష్ణుతేజ, కోశాధికారిగా దయానంద్ ఎన్నికయ్యారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా వాణి, ప్రధాన కార్యదర్శిగా లీలాకుమారి, కోశాధికారిగా రాధిక, పీఆర్వోగా చంద్రశేఖర్‌రావు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది.

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు శివారుల్లో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో వాసు (56) మృతి చెందాడు. తాలూక ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి కథనం మేరకు.. తవణంపల్లె మండలం పత్రాంపల్లెకు చెందిన శ్రీనివాస్, స్నేహితుడు వాసు ఆదివారం ద్విచక్రవాహనంపై వెళుతున్నారు, చిత్తూరు శివారుల్లోని చెర్లోపల్లె వద్ద రోడ్డు దాటడానికి ప్రయత్నించారు. ఇదే సమయంలో తిరుపతి నుంచి బెంగళూరు వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో వాహనం నడుపుతున్న శ్రీనివాస్ రోడ్డు పక్కకు పడడంతో గాయాలయ్యాయి. వెనుకవైపు కూర్చున్న వాసు గాల్లో ఎగిరి రోడ్డుపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో..


పవన్ మృతదేహం

మదనపల్లె : మండలంలోని మాలేపాడు గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. చిత్తురు జిల్లాలోని పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెకు చెందిన ఉల్లాడిపవన్(37) గత పదిహేనేళ్లుగా అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలం బండ్లపై పంచాయతీ జాండ్రబైలు గ్రామంలో నివాసం ఉంటూ బోరు రిపేరీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం మరో ముగ్గురితో కలిసి మదనపల్లె మండలం మాలేపాడు పంచాయతీలోని ప్రభుత్వ తాగు నీటి బోరు రిపేరీ చేసేందుకు వెళ్లాడు. ఉదయం అల్పాహారం తీసుకుంటుండగా అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే సహచరులు ఆస్పత్రికి తరలించేందుకు సిద్ధమవుతుండగా, అప్పటికే స్పృహ తప్పి కిందపడిపోయాడు. సమాచారం తెలుసుకున్న సర్పంచ్ గణేష్ హుటాహుటిన అక్కడికి చేరుకోగా అప్పటికే పవన్ మృతి చెందాడు. జరిగిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకుని తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న తాలూకా పోలీసులు పవన్ మృతికి సంబంధించి సహచరుల స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు హరీష్, జగదీష్, కుమార్తె మేఘన ఉన్నారు.

